# ద్వైతం

శ్రీనివాస్ చేసిన ఘనకార్యం, బ్రహ్మచారి నారాయణ ఇచ్చిన బర్త్‌డే పార్టీలో చర్చకు రావటంలో ఆశ్చర్యం లేదు. ఎందుకంటే శ్రీనివాస్ చేసిన పని అతన్నీ, శ్రీదేవినీ తెలిసిన అందరినీ, ఆశ్చర్యచకితుల్ని చేసింది. పైగా చేసింది చేసెయ్యటమే కాకుండా శ్రీనివాస్ ఆ పార్టీకి పూలరంగడులా తయారై వచ్చాడు. అదే ఆశ్చర్యం కలిగించే విషయం అనుకొంటే అంతకంటే ఆశ్చర్యం కలిగించే విషయం ఆ పార్టీలో, మిత్రులందరూ అతని చుట్టూ, హీరో చుట్టూ ఫాన్స్ మూగినట్టు మూగటం.

నారాయణ ఇచ్చే పార్టీలకో విశిష్టత ఉంది. ఆ ఇంట్లో పదిమంది చేరి పొగ తాగితే పొమ్మనేవారు ఎవరూ లేరు. మందు తాగితే వద్దనేవారు లేరు. నారాయణ రెండూ తాగుతాడు. రెండూ ఇస్తాడు మిత్రులకి.

“ఏమండీ! నా మొహం, పిల్లల మొహం చూసైనా మీ అలవాట్లు మానుకోండి” అంటూ కన్నీరు పెట్టుకోడానికి అతనికి ఇల్లాలు లేదు.

అందుకని అతనిచ్చే పార్టీలు సందడిగా ఉంటాయి. భార్యల్ని ఇంట్లో వదిలేసి రాగలిగిన సౌకర్యం, ధైర్యం ఉన్న మిత్రులు, భార్యలు పుట్టింటికి వెళ్లిన మిత్రులు, అతను పార్టీ ఇస్తే అవకాశం వదులుకోకుండా వస్తారు. కడుపునిండా తింటారు. కక్కుర్తి తీరా తాగుతారు. నోటి దురద తీరేలా అవాకులు చెవాకులు మాట్లాడ్తారు.

అటువంటి పార్టీలో ఒకసారి సుబ్బారావు “మన నారాయణ, బజారులో పాలు దొరుకుతుంటే, ఆవును ఇంట్లో కట్టేసుకొని, దాని బరువు బాధ్యతలు మీదేసుకొనే వెర్రివాడు కాదు” అని అననే అన్నాడు. నారాయణ దానికి నవ్వి ఊరుకొన్నాడే కాని బజారులో పాలుకొనుక్కుంటున్నట్టు అంగీకరించనూ లేదు. కాదని కసురుకోనూ లేదు. నారాయణ నిశ్శబ్ద శ్రోత.

శ్రీనివాస్, రామారావు, నారాయణ, సుబ్బారావులు ఆంధ్రా యూనివర్శిటీలో కలిసి చదువుకొన్నారు చిన్నతనంలో వీరి సన్నిహిత సహాధ్యాయులు కొందరారోజు పార్టీలో ఉన్నారు. చంద్రా మరికొందరు సన్నిహిత సహాధ్యాయులు ఆ పార్టీకి రాలేదు శ్రీనివాస్ రావచ్చునని ఊహించి. చదువుకొనే రోజుల్లో చంద్ర, శ్రీనివాస్‌లు సినిమాలు కలిసి చూస్తూ, బీర్లు కలిసితాగుతూ అభిప్రాయాలు కలబోసుకొంటూ కాలక్షేపం చేసేవారు. చదువైపోయాక వేరు వేరు ఊళ్లల్లో ఉద్యోగాలు చేసుకొంటూ కూడా వీలైనన్ని సార్లు కలుసుకొంటూ స్నేహాన్ని కొనసాగిస్తూ వచ్చారు.

ఒకరోజు చంద్ర "మన స్నేహం బంధుత్వంలోకి మారితే బావుంటుందని పిస్తోందోయ్! మా చెల్లెలు శ్రీదేవిని పెళ్లి చేసుకోకూడదూ!" అన్నాడు శ్రీనివాస్‌తో.

శ్రీదేవి అందమైంది. లిటరేచర్ ఆనర్స్ పూర్తిచేయబోతోంది. పైగా తన అప్తమిత్రుడి చెల్లెలు. శ్రీనివాస్ చంద్ర చేసిన సూచనని సంతోషంగా ఆమోదించాడు.

శ్రీదేవి కూడా శ్రీనివాస్ చాలాసార్లు అన్నతో చూసింది. చదువులో దిట్టని. మంచి ఉద్యోగంలో ఉన్నాడని పెళ్లికి ఒప్పుకుంది. అందుచేత ఆ వివాహం. ప్రేమ వివాహం కాకపోయినా ముక్కూ ముఖం తెలియని ఇద్దరు చేసుకొన్న పెళ్లికాదు. పెళ్లయ్యే నాటికి శ్రీనివాస్‌కి ఇరవై మూడేళ్లు, శ్రీదేవికి ఇరవైయేళ్లు.

శ్రీనివాస్ ఇప్పుడు ఊళ్లో పెద్ద బాధ్యతగల ఆఫీసరు. శ్రీదేవి అంతపెద్ద ఆఫీసరుకి తగిన భార్యగా సంఘంలో గుర్తింపు తెచ్చుకున్నది. వాళ్లది ఆదర్శ దాంపత్యం అనుకొనేవారు వాళ్లని తెలిసినవాళ్లు.

అటువంటి శ్రీదేవిని కాదని, శ్రీనివాస్ ఇంట్లోంచి వెళ్లిపోయి వసుధతో కాపురం పెట్టడం అందరినీ ఆశ్చర్యపరచదా! సంచలనమే కలిగించింది. శ్రీదేవి శ్రీనివాస్‌కి, అతని వారికి చాకిరీ చేయటమే జీవిత పరమార్థంగా వైవాహిక జీవితం గడిపింది. తనకంటూ ఓ ఉద్యోగం, స్నేహితురాళ్ల వలయం ఆమె ఏర్పరుచుకోలేదు. శ్రీనివాస్ గొప్పతనం, ఉన్నతి తనవిగా భావించింది. అతను పూర్తిగా తన వాడని నమ్మింది. వసుధతో అతను సంబంధం పెట్టుకొన్నాడని తెలిసినప్పుడు ఆమె ప్రపంచం బూటకమైంది. తనకి జరిగిన అన్యాయం అర్థమయ్యాక కొడుకుని, కూతుర్ని తీసుకొని అన్న చంద్ర ఇంటికి చేరింది. తన చదువు ఆ వయస్సులో తనకి ఆధారం చూపించగలదో లేదో తెలియకపోయినా.

చంద్ర శ్రీనివాస్ ఉన్న ఊరు వచ్చి శ్రీనివాస్‌ని కలుసుకొని మాట్లాడాడు. సన్నిహిత సహాధ్యాయుల దగ్గర శ్రీనివాస్ తన చెల్లెలికి చేసిన అన్యాయం గురించి వ్యధ వెళ్ళబోసుకొన్నాడు. నారాయణ పార్టీ ఇచ్చిన రోజున చంద్ర ఊళ్లో ఉన్నాడనీ తెలిసి నారాయణ అతన్ని కూడా పిలిచాడు. కాని చంద్ర మనస్కరించక వెళ్లలేదు. అప్పటికి శ్రీదేవి చంద్రవాళ్ల ఊరు చేరి పదిరోజులే అయింది.

పార్టీలో రామారావు ఊరుకోలేక అడిగాడు.

"శ్రీనివాస్! నువ్వూ శ్రీదేవీ ఇష్టపడే పెళ్లిచేసుకొన్నారు. ముప్పై ఏళ్లు ఇష్టంగానే కాపురం చేసారు. ఇప్పుడు నీకు వేరే ఆమె కావల్సివచ్చిందా? ఎందుకని శ్రీదేవికింత అన్యాయం చేశావ్?" అంటూ.

దానికి శ్రీనివాస్ "మైడియర్ ఓల్డ్ ఫాషన్డ్ రామారావు. నాకు మొదటి నుంచి ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ మారేజి మీద నమ్మకం లేదు. అయినా ముప్పై ఏళ్లపాటు ఆ వ్యవస్థలో మనస్సు చంపుకొని ఇమిడాను. నాకు శ్రీదేవి పట్ల ఈ నాటికి ప్రేమాభిమానాలు ఉన్నాయి. పోతే నాకు వసుధపట్ల భౌతికమైన ఆకర్షణ కలిగింది. ఆమె కూడా ఆకర్షితురాలు కావటం వల్ల మాకు దైహికమైన సంబంధం ఏర్పడింది. వివాహేతర సంబంధం పాపం

అని నేను అనుకోవటం లేదు. శ్రీదేవి దానిని అంగీకరించకలేకపోయి ఇంట్లోంచి తనంతట తాను వెళ్లిపోయింది. షి ఈజ్ మై లీగల్లీ వెడ్డెడ్ వైఫ్, తన స్థానంలో ఏ మార్పూ లేదు. పూర్ గర్ల్! ఐ పిటీ హర్! అర్థం చేసుకోలేదు తను నన్ను సరిగా" అంటూ తన ప్రవర్తనలో విడ్డూరమైనదేమీ లేదనీ, తను శ్రీదేవికి ఏవిధమైన అన్యాయమూ చెయ్యలేదన్న ధోరణిలో మాట్లాడాడు. ఇతనికి నీతిమీద గౌరవం లేదు. న్యాయం పట్ల భయం ఉంది!

"రామారావు మాటలకేంగాని మాక్కూడా అటువంటి సెటప్పు చూసి పెట్టుగురూ!" అన్నాడు సుబ్బారావు.

శ్రీనివాస్ నవ్వి జవాబు చెప్పలేదు.

"అటువంటివి ఇతర్లు చూసిపెట్టరు" అన్నాడు నారాయణ.

"నీ భార్యకు కూడా చూసి పెడ్తాడు" అన్నాడు రామారావు కోపంగా.

"మా ఆవిడకి ఆ అవసరం ఉందనుకోను. ఆవిడకి నా కోర్కెలు తీర్చే ఓపికే లేదు. ఇంకోడు కావలసివచ్చి లేచి పోతుందనుకోను. అనుకొన్నా మా ముసల్దాన్ని లేవదీసుకు పోవడానికి ముందుకు వచ్చే సరసులూ ఉండరు" అన్నాడు సుబ్బారావు. సుబ్బారావుకి నోట్లో మందుపడ్తే దాని మీద అదుపుండదు.

"మనలో చాలామందికి శ్రీనివాస్‌కున్న ధైర్యం లేక కాని, చిన్న ఇల్లంటే సరదాలేక కాదు" అన్నాడు మరో మిత్రుడు.

"పెళ్లి కాని ముదురువనితలు, అనుభవశాలులైన వితంతువులు, డైవోర్సీలు బోలెడుమందున్నారు ఈ ప్రపంచంలో, ట్రై చేసే ధైర్యం ఉండాలే కాని" ఇంకోడన్నాడు.

"నువ్వేమన్నా ట్రై చేసి సక్సెస్ అయ్యావా?"

"మనందరిది నోటి దురద. నారాయణలాంటి వారేం చేస్తారో చెయ్యరో మనకి తెలియదు. చేస్తారన్న ఊహ తప్పించి, శ్రీనివాస్ లాంటి డేర్‌డెవిల్స్ చేసి చూపిస్తారు"

పార్టీ అంతా నవ్వులతో కోలాహలంగా జరిగిపోయింది. అక్కడ చేరిన చాలామంది దృష్టిలో ఎంతమంది ఎక్కువమంది స్త్రీలతో సంబంధం పెట్టుకోగలిగితే అంత అదృష్టం అనీ, శ్రీనివాస్ అదృష్టవంతుడనీ.

* * *

మూడు నెలల తరువాత చంద్ర కూతురు పెళ్లి జరిగింది. ఆ పెళ్లికి రామారావు వెళ్లాడు. శ్రీనివాస్‌కి పిలుపు వచ్చింది కాని అతను వెళ్లలేదు.

శ్రీదేవి విషాద మౌనం, ఆ పెళ్లిలో బాజా భజంత్రీలకంటే, పెళ్లివారి సందడి కంటే కూడా గట్టిగా రామారావు గుండెలకి వినిపిస్తూనే ఉంది.

మగపెళ్ళివారు వెళ్లిన సాయంత్రం రామారావుకి శ్రీదేవితో మాట్లాడే అవకాశం దొరికింది. కాని వంటరిగా కాదు, ఆమెకి అయినవారి సమక్షంలో శ్రీదేవే నిశ్శబ్దాన్ని భంగపరుస్తూ–

"ఆయనెలా ఉన్నారన్నయ్యగారూ?" అని అడిగింది. ఆమె మాటల్లో శ్రీనివాస్ పట్ల ఇంకా మిగిలిపోయిన భ్రమ వినిపించింది రామారావుకి.

“ఎలా ఏమిటమ్మా? పూలరంగడిలాగా ఉన్నాడు. నువ్వే వడలిపోయిన తోటకూరకాడలా ఉన్నావు! అతనికోసం నువ్వెందుకమ్మా బెంగపెట్టుకోడం? చదువుకొన్నదానివి నీ కాళ్లమీద నువ్వు నిలబడగలదానివి. నీకోసం నిలబడే అన్నయ్య ఉన్నదానివి. నిన్ను ప్రేమించే పిల్లలున్నదానివి” అన్నాడు రామారావు.

శ్రీదేవి జవాబు చెప్పలేదు.

“మీ స్నేహితులంతా అతని నోట్లో ఇంత గడ్డిపెడ్తారనుకొన్నాం” అన్నాడు శ్రీదేవి పెత్తండ్రి కొడుకు.

అతని అదృష్టానికి అసూయపడిన శ్రీనివాస్ స్నేహితులు అతనికి గడ్డిపెట్టటమా! ఆ ఆలోచన రామారావుకి నవ్వు తెప్పించింది. అతను దాన్ని దాచుకొని

“అతనికి వివాహ వ్యవస్థ మీద నమ్మకం లేదన్నాడు” అన్నాడు.

“పెళ్లికి ముందే నమ్మకం లేనివాడైతే పెళ్లెందుకు చేసుకొన్నాడుట? లేక పెళ్లయిన ముప్ఫైయేళ్లకి పోయిందా? తన్నేవాళ్లు లేక” అన్నాడింకో అయినవాడు.

“మెయింటనెన్సు ఖర్చులు అయినా ఇస్తాడా? దానిమీదా నమ్మకం లేదా? అతనికి లేకపోయినా కోర్టులకుంటుంది” అన్నాడు శ్రీదేవి పినతండ్రి.

“ఆ విషయం మా మధ్య ప్రస్తావనకి రాలేదు. శ్రీదేవిని తను పొమ్మనలేదనీ, ఆమె ఎప్పుడు తిరిగివచ్చినా తనకి సమ్మతమేనని, ఆమె పట్ల తనకి జాలి ఉందని చెప్పాడు.”

అక్కడ పార్టీలో అంతా శ్రీనివాస్‌పట్ల ఆరాధనా భావంతో మాట్లాడారు. ఇక్కడంతా శ్రీదేవి పట్ల సానుభూతితో మాట్లాడుతున్నారు. మాట్లాడినది అక్కడా ఇక్కడా మగవాళ్లే అయినా చూస్తున్న కోణం వేరుగా ఉంది. ఈ తేడా ఎందువలన? రామారావు ఆలోచనలో పడ్డాడు.

“చంద్ర ఆర్థిక స్తోమత కలవాడు. శ్రీదేవి చదువుకొన్నది. అందువల్ల తాత్కాలికంగానైనా ఆమె బాధ్యత, ఆమె పిల్లల బాధ్యతా స్వీకరించటానికి అయింది. అదే నా ఇంట్లో జరిగితే నాకు స్తోమతా లేదు. మా ఆవిడ ఒప్పనూ ఒప్పదు. చాలామంది విషయంలో అంతే. అప్పుడు దగాపడిన చెల్లెళ్ల గతేమిటి?” అన్నాడు శ్రీదేవి పినతండ్రి కొడుకు.

రామారావుకి హఠాత్తుగా ఆలోచనలు ఓ కొలిక్కి వచ్చాయి. వివాహేతర సంబంధాలలో కొందరు థ్రిల్, రసికత చూస్తే, బరువు, బాధ్యత వేదనా మరి కొందరు చూస్తున్నారు. మనకి సంబంధమో సామీప్యమో ఉన్నవాళ్ల సమస్యలతో మనం మమైక్యం చెందుతాం. సహ అనుభూతి పొందుతాం.మనకి ఏమీకాని వారి విషయంలో చాలా తేలికగా, బాధ్యతారహితంగా మాట్లాడగలం. అ చెల్లెలు విషయంలో ఆమె పట్ల సానుభూతి చూపించినవారే అన్నదమ్ముడి వివాహేతర సంబంధంలో రసికత చూడగలరు! అసూయ పడగలరు. వీళ్లు రెండు వర్గాలు కారు. నాణానికి రెండు వైపులున్నట్లే మనిషి మనసుకీ రెండు వైపులున్నాయి.

రామారావు శ్రీదేవికి మేలు జరగాలని కోరుకొంటూ సెలవు తీసుకొన్నాడు.